

# గేట్‌మ్యాన్

ఎక్స్‌ప్రెస్, ఆ వెనుకే ప్యాసింజరు వెళ్ళింది...

రెండు రైళ్ళకి పచ్చజెండా చూపించి క్యాబిన్‌లోకొచ్చాడు గేట్‌మ్యాన్ గంగులు. అప్పటికే అది హైవే అవడం వల్ల బస్సులు, లారీలతో ట్రాఫిక్ జామైపోయింది.

"తొందరగా తెరవయ్యా గేటు" అన్నట్లు గుయ్‌మంటున్నాయి హారన్లు.

మరో అయిదు నిమిషాల్లో గూడ్స్ వస్తున్నట్లు సంకేతం అందడంతో ఈలోగా గేటు తీస్తే ట్రాఫిక్ క్లియర్ అవుతుందో లేదోనని మిన్నకుండిపోయాడు గంగులు.

"రైళ్ళన్నీ వెళ్ళినా నీకింకా గేటు తియ్యబుద్ధి కాలేదా నాయనా?" ఖంగుమంది ఓ బస్సు డ్రైవరు కంఠం.

"చిల్లరకు అలవాటు పడ్డ ప్రాణిలా ఉంది. అయిదు రూపాయిలు ఉంటే పారేయ్" క్లీనరుతో అన్నాడో లారీ డ్రైవర్.

"కొందరు గేట్ మ్యాన్లంతే" గొణుక్కుంటున్నారు బస్సులు దిగి రోడ్డు మీద అసహనంగా పచార్లు చేస్తున్న ప్యాసింజర్లు.

ఈ చీత్కారాలు గంగులుకు మామూలే....ఎవరెన్ని విధాల తిట్టుకుంటున్నా వాటిని దీవెన్లగా భావించి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంటాడు గంగులు.

గూడ్స్ కూడా వెళ్ళిపోయింది.

గేటు తెరిచి ఊపిరి పీల్చుకున్నాడు.

వాహనాలన్నీ రొద చేసుకుంటూ ముందుకు కదిలాయి.

మధ్యాహ్నం ఒంటిగంట అవుతోంది. మాఘమాసం సూర్యుడు నడినెత్తినెక్కి నిప్పులు చెరుగుతున్నాడు.

గంగులుకు కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. పొద్దున్నుంచి ఏమీ తినకపోవడం వల్ల వంట్లో నీరసంగా ఉంది.

"ఈ పొద్దు బాగా నేటైపోనాది మావా" క్యారేజి విప్పి ఆకులో అన్నం వడ్డిస్తూ అన్నది గౌరి.

ఆబగా ముద్ద మీద ముద్ద విసిరేయడంతో వెక్కిళ్ళొచ్చాయి గంగులుకి.

ఓ చేత్తో నెత్తిమీద మొత్తుతూ మరో చేత్తో పెనిమిటికి మంచినీళ్ళ గ్లాసు అందించింది గౌరి.

"ఈ గేటు ఊరికి శానా దూరం మావా, ఎంత తొందరగా నీకు కూడట్టు కొద్దామన్నా అవట్లేదు" తన అశక్తతకు నొచ్చుకుంది.

"చాల్లే నీనించే ఈ పాట్లొచ్చి పడ్డాయి. మనూళ్లో నిమ్మకు నీరెత్తినట్లు హాయిగా ఉండేవాళ్లం. నయగారాలు సెయ్యక క్యారేజీ కడుక్కురా" పెళ్ళాన్ని కసరుకున్నాడు గంగులు.

"ఏట్రా ఆలినట్టా కడిగేస్తున్నావ్. తిండి అట్టుకొచ్చినందుకేటి?" అంటూ దగ్గరకొచ్చాడు అచ్చిబాబు.

"నైడ్యూటీ వోడివి ఇప్పుడొచ్చావేటి?"

"నాడూటీ నాకు తెల్సులేవయ్యా. నిన్నో సలహా సేద్దామని..."

గిన్నెలో చేయి కడుక్కుంటూ తలెత్తి చూశాడు గంగులు......

క్యారేజీ గిన్నెలు పుచ్చుకుని బోరింగు వద్ద కెళ్ళింది గౌరి.

"ఏం నేదయ్యా. ఈ గేటు కాడ బడ్డీ ఎడితే ఎట్టా ఉంటాదంటోంది ఇల్లాలు.

"ఇంతకీ నీకు డ్యూటీ సమంగా సేయాలని ఉందా లేదా ముందది సెప్పు."

"తిరకాసుగా మాట్లాడకు. బడ్డీకి, నా డ్యూటీకి లింకేంటి?" నొసలు చిట్లించాడు అచ్చిబాబు.

"ఉంది గనకే సెబుతున్నాను......

నువ్వు డూటీ గనక సమంగా సేయాలనుకుంటే బడ్డీ మాట తలపెట్టకు.

ఆడోళ్లు ఇట్టాంటి సచ్చు సలహాలే ఇత్తుంటారు. సూత్తున్నావుగా నా పాట్లు

ఊరుగానూరొచ్చి కుక్కలా ఈడ సెట్టైపోనానంటే అదంతా నా పెళ్ళాం సలవేనయ్యా."

"నువ్వు సెప్పేదేటో నాకేం బోదపడి సావడం లేదు. కాస్త ఇడమర్చి సెప్పరాదూ."

నోరు విప్పాడు గంగులు.

.....

"ఓ తడవ గేటెయ్ మావా......సోడా కాయలు మిగిలిపోనాయి" పెనివిటిని బ్రతిమలాడింది గౌరి....

"నీకు ఏలాకోలంగా ఉందేటే? బండి రాందే గేటెట్టా ఎయ్యమంటావ్?" భార్య మీద కసురుకున్నాడు గంగులు.

రైలొస్తే నిన్నుడిగేదేటి? ఎట్టానూ గేటు పడతాది.... ఆ సంగతి నాకు తెలవక కాదు. ఎండ సుర్రుమంటోంది కదా. ఈయాలప్పుడైతే సోడాలు బేగి అమ్ముడైపోతాయని. అదిగో అటు సూడు రెండు బస్సులు ఒక్కసారే వత్తున్నాయ్. గేటెయ్యి మావా" తొందరపెట్టింది గౌరి.....

పెళ్లాం పోరు పడలేక గేటు వేశాడు గంగులు.

బస్సులకు బ్రేకులు పడ్డాయి.

"చల్లని సోడాలయ్యా....కమ్మటి మజ్జిగయ్యా" తట్టెత్తుకుని బస్సుల చుట్టూ తిరుగుతోంది గౌరి.

"నాకో సోడా!"

"నాకు మజ్జిగ!"

అడుక్కుని సరుకంతా ఇట్టే అమ్ముడైపోయింది.

గేటు తెరిచాడు గంగులు.

"బండి రాకపోతే గేటు ఎందుకేసినట్టు" విస్మయాన్ని ప్రకటిస్తూ మండిపడ్డాడు బస్సు డ్రైవరు.

"మరి కాస్త టైంపడతాదని ఫోనొచ్చింది అందుకే గేటెత్తేసాను" అతడికేదో ఉపకారం చేసి ఉద్ధరించినట్లన్నాడు గంగులు.

"థాంకు మావా థాంకు...సరుకంతా ఐపోనాది......నీకియాల కూడులో సేపల పులుసెడతాలే" గంగులుకి కృతజ్ఞతలు చెబుతూ తుర్రుమంది గౌరి....

ఆమె మెచ్చుకోలుకు బూరిలా ఉబ్బిపోయాడు గంగులు.

ఆ రోజు లగాయితూ భార్యని సంతోషపెట్టడం కోసం ట్రైను రాకతో నిమిత్తం లేకుండా గేట్లు వేయసాగాడు. కర్తవ్యం, స్వార్థం తలపడ్డ పోటీలో స్వార్థమే విజయాన్ని వరించింది. ఏమిటయ్యా ఇది అని ఎవరైనా నిలదీస్తే ట్రాకు బాగోలేనందున వస్తున్న

రైలు మధ్యలో ఆగిపోయిందనో, పొరపాటు సమాచారం అందిందనో ఏదో ఒక కుంటి సాకు చెప్పేవాడు. ఫలితంగా గౌరికి డబ్బుల పంట. గంగులుకి విందు భోజనం లభిస్తోంది.

బొల్లి కబుర్లు చెప్పి ఎంత మందిని ఎంత కాలం మభ్య పెడతాడు? ఎవరు ఫిర్యాదు చేశారో ఏమో అర్జెంటుగా రమ్మనమని అధికారుల నుండి వర్తమానం వచ్చింది.

ప్రమోషను కాబోలనుకుని చంకలు గుద్దుకున్నాడు గంగులు.

"మిస్టర్ గంగులు నీ మీద చాలా కంప్లైంట్లు వస్తున్నాయి" గుర్రుమన్నాడు ఉన్నతాధికారి.

ఏదో చెప్పబోయాడు గంగులు.

"సంజాయిషీ వద్దు.....నువ్వు చేస్తున్న నేరానికి శిక్షేమిటో తెల్సా?"

బిత్తరచూపులు చూశాడు గంగులు.

"పిల్లలు గలవాడివని దయతలచి నిన్ను సస్పెండు చేయడం లేదు. దూరంగా బదిలీ చేస్తున్నాను. ఇక నుంచైనా వెర్రి మొర్రి వేషాలు మానేసి సక్రమంగా డ్యూటీ చేస్కో" అంటూ ట్రాన్స్‌ఫర్ ఆర్డరు చేతిలో పెట్టాడు ఆ అధికారి.

.....

"ఇల్లాలి మాట ఇని నువ్వీయాల బడ్డీ ఎడతావు. రేపు బేరాలు లేవని నాలాగే గడ్డి కరుస్తావ్....అందుకే సెబుతున్నాను. ఇంగితంగా నడసుకోకుంటే నా గతే నీకూ దాపురిత్తాది" హెచ్చరించాడు గంగులు.....

ఆలోచనలో పడ్డాడు అచ్చిబాబు.

**(5 ఆగష్టు 2001, ఆంధ్రప్రభ, డైలీ)**